క్లుప్తంగా

9న సేవ్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్

కర్నూలు కల్చరల్: ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన అనంతపురంలో రెండవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేవ్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఈసీ జిల్లా అధ్యక్షుడు టి.వెంకటరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డి.రామశేషయ్య తెలిపారు. శుక్రవారం ఎస్ఏపీ క్యాంప్‌లోని నగరపాలక ఉన్నత పాఠశాలలో కాన్ఫరెన్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం, ఉన్నత విద్యలో మార్పులు, నాలుగేళ్ల డిగ్రీ తదితర అంశాలపై సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ ఎ.కరుణానందన్, జాదవపూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ తరుణ్‌కాంతి నస్కర్, డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కొప్పర్తి వెంకటరమణమూర్తి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ జిల్లా కార్యదర్శి వి.హరీష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

కర్నూలు(అర్బన్):రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని జేఏసీ నేతలు సయ్యద్ రోషన్ అలీ, సింధూ నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక సంపత్‌నగర్‌లోని కార్యాలయంలో కురువ నాగేష్ అధ్యక్షతన బహుజన రిజర్వేషన్ సామాజిక న్యాయంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 80కి పైగా సీట్లను ఆయా వర్గాలకు కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకొని సీట్లు కేటాయించాలన్నారు. సమావేశంలో వివిధ కుల సంఘాల నాయకులు షఫీఉల్లా, శ్రీనివాసులునాయుడు, చంద్రకళ, సిద్దిక్, షేక్షావలి, డీవీ చంద్ర, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

9న అమరవీరుల స్మారక సభలు

కర్నూలు(సెంట్రల్): నవంబర్ 9వ తేదీన అమరవీరుల స్మారక సభలను వేంపెంటలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి.వెంకటస్వామి, జిల్లా నాయకులు రంగనాయకులు తెలిపారు. శుక్రవారం గోకారి భవన్‌లో స్మారక సభలకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేసి మాట్లాడారు. ఏటా విప్లవకారులను మననం చేసుకోవడం కోసం అమరవీరుల స్మారక సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి రమేష్, నగర కార్యదర్శి రాము, నాయకులు గోకారి, మౌలాబీ, రాజమ్మ, సాయి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవహారాల్లో జాగరూకత అవసరం



వాక్‌థాన్ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకింగ్ వ్యవహారాల్లో జాగరూకత చాలా అవసరమని భారతీయ స్టేట్‌బ్యాంక్ కర్నూలు డిప్యూటీ జనరల్ మేనేజర్ లే ఖామీనస్ తెలిపారు. ప్రతి ఒక్కరు నీతి, నిజాయితీలను పెంపొందించుకోవాలని చెప్పారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2023 లో భాగంగా ఎస్‌బీఐ పరిపాలన కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు మెయిన్ బ్రాంచ్ నుంచి 5 రోడ్ల కూడలి వరకు, ఐదు రోడ్ల కూడలి నుంచి మెయిన్ బ్రాంచ్ వరకు వాక్‌థాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ...బ్యాంకింగ్ సంబంధ విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ చేపడుతున్న రుణ పథకాలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం సత్యనారాయణస్వామి, చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్, మురళీకృష్ణ, రవీంద్రనాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఎస్ఈఏఎస్ సర్వే

కర్నూలు (టౌన్): కల్లూరు మండలంలో ఎంపిక చేసిన 47 పాఠశాలల్లో ఎస్ఈ ఏఎస్ (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి వెల్లడించారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎంఈఓలు పరిశీలించారు. అభ్యసన స్థాయిని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

డయాలసిస్ పేషెంట్‌కు పెన్షన్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని పందిపాడు గ్రామంలో మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న బి. రాజేశ్వరి అనే మహిళకు కొత్తగా పెన్షన్ మంజూరైంది. శుక్రవారం కల్లూరు మండలం సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసి అండగా నిలవడంపై రాజేశ్వరి సంతోషం వ్యక్తం చేశారు.







19వ వార్డు వైద్యశిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య, శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు, 46వ వార్డులో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

పేదల ఇంటి ముంగిటకే వైద్యసేవలు

- జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య
- 19వ వార్డులో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కర్నూలు (టౌన్) : రాష్ట్ర ప్రభుత్వం పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం వారి ఇంటిముంగిటకే వైద్య సేవలను తీసుకొచ్చిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 19 వ వార్డు పరిధిలోని శకుంతల కళ్యాణ మండపం వెనుక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే, మేయర్ శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించారన్నారు. ఎంతో మంది ప్రాణాలు కాపాడరన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి పేదలకు వారి ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం ముఖ్యం కావడంతో 45 రోజుల పాటు ప్రతి కాలనీలో వైద్య శిబిరాలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటుందన్నారు. వైఎస్ఆర్ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు సైతం పంపిణీ చేస్తుందన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ గోపాల్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక 46 వ వార్డు పరిధిలోని అశోక్‌నగర్ 120 వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి రోగులతో మాట్లాడారు. ఉచితంగా మందులు ఇస్తున్నారా.. కంటి అద్దాలు ఇస్తున్నారా అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని చెప్పారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యమన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఇంటి వద్దే ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారన్నారు. గతంలో ఈలాంటి కార్యక్రమాలు లేవన్నారు. వైద్య శిబిరాల్లో వైద్యులు సిఫార్సు చేసిన రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వాసు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు



ఈ వయస్సులో ఆసుపత్రికి పదే పదే వెళ్లాలంటే ఇబ్బంది. ఖర్చు కూడా. జగన్ ప్రభుత్వం వార్డులోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వలంటీర్ల ద్వారా తెలుసుకున్నా. ఇక్కడ అన్ని ఆరోగ్య పరీక్షలు చేశారు. కళ్ల పరీక్ష కూడా చేయించుకున్నా. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. మాలాంటి వారి ఆరోగ్యం కోసం ఇళ్ల వద్దకు వచ్చి సేవలు అందించడం సంతోషంగా ఉంది.

– మద్దమ్మ, వృద్ధురాలు, సి. క్యాంపు

కూతురికి టీకా వేయించా



వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని తెలుసుకుని నా కూతురితో వచ్చా. నేను ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నా. అలాగే ఇక్కడ పిల్లలకు టీకాలు వేస్తున్నట్లు వైద్యులు చెప్పడంతో కూతురికి కూడా టీకాలు వేయించా. గతంలో ఎవరూ పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు ఇంటి వద్దనే ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు ఇవ్వడం ఆనందంగా ఉంది.

– భారతి , 19 వ వార్డు గణేష్ నగర్

శివారు అభివృద్ధికి చర్యలు

కర్నూలు (టౌన్): చాలాకాలంగా నిర్లక్ష్యానికి గురైన నగరపాలక శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని 34 వ వార్డులో రూ.30 లక్షలతో మురహరి నగర్‌లోని ఖాళీ స్థలానికి కాంపౌండ్ వాల్, రూ.49.80 లక్షలతో గీతానగర్, గోపీనగర్ వద్ద సీసీ రోడ్డు, సీసీ డ్రైన్, రూ. 49.80 లక్షలతో గీతానగర్, గోపీనగర్‌లోని 5 వ లైన్ 6 వ లైన్ వద్ద సీసీ రోడ్డు, సీసీ డ్రైన్, రూ.50 లక్షలతో 600 ఎంఎం డ్రైన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే, మేయర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కల్లూరు కాలనీలను పట్టించుకోలేదన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి వారి సమస్యలను వదిలేసిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కోట్లాదిరూపాయలు వెచ్చించి శివారు, ప్రధాన కాలనీల్లో పెద్ద ఎత్తున్న మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎరుకలి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



34వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

గడప గడపలో సంతోషం



జగనన్న పాలన గురించి ప్రజలకు తెలియజేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిస్తున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక 44వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీతరామ్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, తద్వారా వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. అలాగే స్థానికుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమది పేదల పార్టీ అని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, నాయకులు ఖాజా, రాము యాదవ్, జంగిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

18 సంవత్సరాలు పైబడిన యువతీయువకులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4,5 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉందని, యువత సమీపంలోని పోలింగ్ బూత్‌లో తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటు ఉన్న వారు సైతం జాబితాలో పేరును సరిచూసుకోవాలని, ఏదైనా మార్పులు చేర్పులు ఉంటే చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

సాఫ్ట్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించాలి

కర్నూలు (టౌన్) : ఈనెల 4 నుంచి 6 వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –17 విభాగం సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాల, బాలికలు పతకాలు సాధించాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి. లక్ష్మయ్య ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బాల బాలికల జట్టును అభినందించి టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎండీ బాష, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: జిల్లాలో నిబంధనలు పాటించని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఆర్ఐవో గురవయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు రవి, జిల్లా సహాయ కార్యదర్శి విజయ్, నగర అధ్యక్షుడు అమర్, జిల్లా కమిటీ సభ్యులు అంజి, మల్లేష్, తదితరులు ఆర్ఐఓను కలిసిన వారిలో ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్) : నగర పాలక సంస్థ పారిశుద్ధ్యం విభాగంలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు. శుక్రవారం కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు.

కర్నూలును కరువు మండలంగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇన్‌చార్జ్ డీఆర్వో మల్లికార్జునుడుకు వినతిపత్రం ఇచ్చా రు.అనంతరం ఆయన మాట్లాడుతూ..జిల్లాలో ని 26 మండలాల్లో 24 మండలాలను కరువుగా గుర్తించారన్నారు.తుగ్గలి,కర్నూలు రూరల్ మండలా ల్లో తడి శాతం ఎక్కువగా ఉందని కరువు ప్రాంతంగా గుర్తించలేదన్నారు.ఆయా మండలాల్లో కూడా రైతులు వేసిన పంటలన్నీ వర్షాలు లేక దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మోజేస్, జాన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను పరిశీలించాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ హరి ప్రసాద్

కర్నూలు (కల్చరల్/సెంట్రల్/టౌన్): డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సక్రమంగా పరిశీలించాలని ఆర్‌డీఓ, ఎన్నికల నమోదు అధి కారి హరి ప్రసాద్ కర్నూలు రూరల్ బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. కోడుమూరు అసెంబ్లీ నియోజక వర్గ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, బూత్ లెవెల్ అధికారుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం కర్నూలు ఎంపీపీ హాల్‌లో జరిగింది. ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ప్రచురితమైన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈరెండు రోజుల్లో అర్హులైన ఓటర్లు ఓటు హ క్కును నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో ఓటు ఉందో లేదో సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల ఉప తహశీల్దార్ ప్రవీణ్, ఏఎస్ఓ శివన్న పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక క్యాంపులు

ఎస్ఎస్ఆర్–2024 ముసాయిదాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించేందుకు శనివారం, ఆదివారం ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు ఆర్‌డీఓ సి.హరిప్రసాదు, నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జాబితాలోని ఓటర్లలో అనర్హులు ఉన్నా, మరణించిన వారి పేర్లు ఉన్నా, తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించిన వారు ఉన్నా, పేర్లు, ఊర్లు, నియోజవకవర్గాల మార్పులతోపాటు 18 ఏళ్ల నిండిన వారు కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇందుకోసం 4, 5 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓలు ఉండి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

అమర్త్యసేన్ సేవలు ఎనలేనివి



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ ఫజలుర్ రహమాన్

కర్నూలు (న్యూటౌన్): ఆర్థిక శాస్త్రంలో అమర్త్యసేన్ అందించిన సేవలు ఎనలేనివని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. ఫజలుర్ రహమాన్ అన్నారు. శుక్రవారం స్థానిక వర్సిటీలో ఎకనామిక్స్ శాఖ, మానవశక్తి పరిశోధన కేంద్రం సంయుక్తంగా నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎకనామిక్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అమర్త్యసేన్ భారతీయతత్వ శాస్త్రవేత్తగా ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి స్వీకరించిన తొలి భారతీయుడు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. సంక్షేమ రంగంలో అమర్త్యసేన్ చేసిన విశేష కృషి నేటి యువతరానికి ఆదర్శం అన్నారు. అనంతరం ఎంఏ ఎకనామిక్స్, ఎంబీఏ కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన నసీమ సత్రీన్, అక్షయరాణిలకు వీసీ రహమాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్ జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అక్తర్‌బాను, డాక్టర్ మహబూబ్‌బాషా, డాక్టర్ వెంకటప్ప, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మాజీ సైనికుల భూ సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మాజీ సైనికుల భూ సమస్యలను పరిష్కరించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్రా పేరయ్య కోరారు. సైనికులు రిటైర్ అయిన అనంతరం మూడు సంవత్సరాల లోపు ప్రభుత్వ భూమి కోసం దరఖాస్తు చేయాల్సి ఉందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను జిల్లా సైనిక్ బోర్డు కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉందన్నారు. అయితే రెండు సంవత్సరాల నుంచి ఆన్‌లైన్‌లో ఉన్న సమస్య పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రీ సర్వే పేరుతో మాజీ సైనికులకు ఇచ్చిన పొలాలను హోల్డ్‌లో పెట్టారని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకుపోయామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో మాజీ సైనికులకు ప్రత్యేకంగా కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. తమకు ఇచ్చిన పొలాలను 10 సంవత్సరాల అనంతరం విక్రయించేందుకు, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జీఓలు ఉన్నాయని, అయితే తహసీల్దార్ కార్యాలయాల్లో ఎన్‌ఓసీలు ఇవ్వడం లేదన్నారు.

హలో బీసీ 5న చలో వైజాగ్

కర్నూలు(అర్బన్): వైజాగ్‌లోని ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం జరుగుతున్నందున హలో బీసీ 5న చలో వైజాగ్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు సంఘం జాతీయ కన్వీనర్ వై. నాగేశ్వరరావుయాదవ్ తెలిపారు. శుక్రవారం బీసీ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వైజాగ్‌లో జరగనున్న జాతీయ కార్యవర్గ సమావేశానికి జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నూకాలమ్మ హాజరవుతున్నట్లు తెలిపారు. బీసీలకు సంబంధించిన అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం రాంబాబు, ఆర్గనైజర్ విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీపీ వెంకటేష్, ఓబులేసు పాల్గొన్నారు.

స్పాట్ బిల్లింగ్‌లో పొరపాట్లు వద్దు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల జారీకి సంబంధించిన స్పాట్ బిల్లింగ్‌లో పొరపాట్లు లేకుండా చూడాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మీటర్ రీడర్ తప్పనిసరిగా ఇల్లు, షాపుల వద్ద ఉన్న మీటర్ వద్దకు వెళ్లి బిల్లు తీయాలన్నారు. బిల్లింగ్ స్కానర్‌తో ప్రతి డిజిటల్ మీటర్‌ను స్కాన్ చేసి రీడింగ్ తీయాలన్నారు. స్కాన్ కాకపోవడం, వాడిన యూనిట్ల కంటే రీడింగ్ హెచ్చు తగ్గలు రావడం వంటి సమస్యలు తలెత్తితే రీడర్లు వెంటనే ఏఈల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

వైద్య సమాచారం

శిశువుకు అరుదైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్):తీవ్ర అనారోగ్య పరిస్థితు ల్లో బరువు తక్కువ ఉన్న శిశువుకు కర్నూలు లోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు నిలిపారు. చికిత్స వివరా లను చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ సింధూర వివరించారు. '32 వారాల గర్భిణీ 1.3 కిలోల బరువున్న బిడ్డకు జన్మనిచ్చింది. గర్భాశయంలోనే ఎదగకపోవడం వల్ల ఊపిరితిత్తుల్లో రక్త స్రావం అవ్వడం, తీవ్రమైన శ్వాసకోశ వ్యాధి, ఇన్‌ఫెక్షన్, థ్రోంబోసైటో పెనియాతో మెడికవ ర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ప్రసవం రోజున శిశువుకు శ్వాసకోశ సమస్య ఉండటం వల్ల అందుకు అవసరమైన చికిత్స చేశాము. ఈ క్రమంలో క్రమంగా శిశువు బరువు పెరగడంతో డిశ్చా ర్జ్ చేశా'మని డాక్టర్ సింధూర వెల్లడించారు.

కిడ్నీ జబ్బులపై రేపు సదస్సు

కిడ్నీ జబ్బులపై ఈ నెల 5వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందన్నారు. కిడ్నీల ప్రాముఖ్యతను నెఫ్రాలజిస్టు డాక్టర్ ఎల్లంపల్లి సాయివాణి వివరిస్తారన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు కల్చరల్: ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని 40వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధిని తెలియజేశారు. అలాగే స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి, నాయకులు గిరి ప్రసాద్, జగన్ యాదవ్, రాము, గౌతమ్, శేఖర్, సూరి, రాజు, శ్రీనివాస్ గౌడ్, జేసీఎస్ కరీం, ఇర్షద్, సూరి, అద్దుగల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

కర్నూలు (టౌన్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని నగరపాలక సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశులు అన్నారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని నగరంలోని బంగారుపేట, గాంధీనగర్, కల్లూరు, ఇందిరమ్మ కట్ట కాలనీల్లో మలేరియా సిబ్బంది ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. నిలువ ఉన్న నీటిని ఖాళీ చేయించారు. పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. వారంలో ఒకరోజు నిలువ నీరు లేకుండా ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టిన వారు అవుతామన్నారు.

ఆకర్షణకులోనైతే జీవితంపై తీవ్ర ప్రభావం

- మహిళా చట్టాలపై అవగాహన సదస్సులో డీఎస్పీ సుధాకర్ రెడ్డి



మాట్లాడుతున్న దిశ మహిళా పీఎస్ డీఎస్పీ

కర్నూలు : తెలిసీ తెలియని వయస్సులో కొంతమంది విద్యార్థులు ఆకర్షణకు లోనై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలా కాకుండా చదువుపై దృష్టి పెడితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దిశ మహిళా పీఎస్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి అన్నారు. కర్నూలులోని బి.క్యాంప్‌లో ఉన్న ఒకేషనల్ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం మహిళా చట్టాలు, దిశ యాప్ డౌన్‌లోడ్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశ యాప్ రిజిస్ట్రేషన్లు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి?, లోన్ ఫ్రాడ్స్ తదితర అంశాలను కూలంకుశంగా వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మాయామాటలు నమ్మి మోసపోవద్దని, సెల్‌ఫోన్ వినియోగం గురించి కూడా వివరించారు. విద్యార్థినులు ఇంటర్నెట్‌ను అవసరమున్నంత వరకే వినియోగించాలన్నారు. దిశ మహిళా పీఎస్ సీఐ కళావెంకటరమణ, ఎస్ఐ మమతతో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌కు మద్దతు ఇవ్వండి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8వ తేదీన జరుగుతున్న విద్యా సంస్థల బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌పీఏ నాయకులు కోరారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయిగోపాల్‌ను వీరు కలిసి బంద్‌కు మద్దతు కోరారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలనే డిమాండ్లతో విద్యా సంస్థల బంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, కోశాధికారి మునిస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఏఐఎస్‌పీఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తదితరులు వీసీని కలిసిన వారిలో ఉన్నారు.